


# "రైలు పెట్టెలో సమ్మె"

... రచన: *వినయశ్రీ* ...

ఎప్పుడూ లేటుగా వచ్చే పాసింజరు ఆవేళ సరిగ్గా టైముకు చక్కావచ్చి టక్కున ఆగింది చూసారా నా 'పంక్చ్యువాలిటీ' అన్న విజయగర్వంతో. బండి ఆగిందేతడవు ప్రయాణీకుల కోలాహలం, ఎవరి హడావిడి వారిది. అసలే గోదావరిస్టేషన్. నిజంగా గోదావరి ప్రవాహంలాంటి జనసందోహం. ఎలాగో తోసుకుని, గెంటుకుని తొడుగుకున్న తెల్లటి మల్లిపువ్వులాంటి బట్టలు మాయకుండా ఎక్కి గుమ్మానికిదగ్గరగావున్న బల్లపై కూర్చున్నాను. 'రెస్ట్'తీసుకున్న రైలుబండి 'గస్ట్'లా ఉత్సాహంగా కదిలింది.

అదేం ఖర్మమో ఈ బండి ఎప్పుడూ ఇంతే! ప్రతిస్టేషన్‌లోను ఆగడమే. ఆగితే త్వరగా కదలకపోవడం. ఒకటా రెండా సరిగా ఒక అరడజన్ బళ్లయినా క్రాస్ అవుతాయి ఈ బండికి. అందుకే కాబోలు ఈబండి ఎప్పుడూ లేటవుతుంది. ఎంత ఓర్మిగల మనిషయినా ఓర్చుకోలేనంత చిరాకుపడక తప్పదు. ఒక్కొక్కప్పుడు లోలోన యేవ్వడంకూడా కద్దు. ఎందుకూ? ఈబండిలో ఎందుకు ప్రయాణం చేయవలసివచ్చిందిరా భగవంతుడా అని.

ద్వారపూడి స్టేషననుకుంటాను ఆగింది బండి. ఆగిందేతడవు ఎక్కింది ఆమె. ప్లాట్‌ఫారంమీదనుంచి ఎవరో అందిస్తున్నారు పిల్లల్ని. ఆమె అందుకుని ఒక్కొక్కరినీ కూర్చోబెడుతున్నది. ముగ్గురు పిల్లల అనంతరం బండెడు సామాన్లతో ఎక్కిందొక నల్లటి సన్నని మగవిగ్రహం. నిశ్శబ్ద నిశీథ చీకటిని చీల్చుకుంటూ రొప్పుతూ బయల్దేరింది బండి.

ఏమిటో ఆమె ఎక్కింది మొదలు అటు చూడకుండా వుండలేకపోయాను. మొట్టమొదట ఆమెను చూడగానే అనుకున్నాను ఆమె ఎవరో 'డ్రామా యాక్టర్స్' అయివుంటుందని కాని గంపెడు సంసారం, భర్త, సామాన్లు నన్నావూహనుంచి తప్పించినాయి. భర్త! ఉం నిరుత్సాహంగా, నిస్తేజంగా మూల్గింది నా మనస్సు. సన్నని నల్లని ఆ మగవిగ్రహం ఆమె భర్తయివుండాలా ? అనుమానం మనస్సులో పెనగులాడింది. "ఏమండీ మీరు కూర్చోరేం ? ఏరా రామూ నువ్వు కొంచం జరిగి మీనాన్నకు చోటియ్యి" అంది గోముగా, వయ్యారంగా తల నాడిస్తూ. అనుమానంలేదు ఖచ్చితంగా అతను ఆమె భర్త. అయ్యో! విధివ్రాతంటే ఇలాగే వుంటుంది కాబోలు. ఏమిటో తెలియని ఆందోళనతో నా హృదయం వూహాగానంలో వూగులాడింది. కాకిముక్కుకు దొండపండులా! బంగారంముందు ఇత్తడిముక్కలా ఆమెముందు అతను కాంతిహీనంగా గీటుకు రాని మానవుడుగా వున్నాడు.

అమె ఎక్కిందిమొదలు ఎందుకో తెలియని ఆనందం ఉత్సాహం నా మనస్సును జుర్రుకున్నాయి. కైపెక్కిన తియ్యని పులకరింపుల తలపులతో ఆకాశవీధుల్లో విహరిస్తున్నా. ఏదో ఒక వంకతో ఆమెతో మాట్లాడితే! అమ్మో గండుపిల్లిలాంటి ఆమె భర్తవున్నాడే! ఆగింది నా ఆలోచన. ఎవరో చెళ్లున చెంపమీద కొట్టినట్టయింది ఉలిక్కిపడ్డాను. ఛి! ఛీ! ఏమిటీ పులకరింపులతోగూడిన పలవరింతలు. నాలో నేనే తిట్టుకున్నాను. సభ్యత అనే కొరడాను నా కళ్లముందు వూహించుకుని అటువైపు చూడగూడదనుకుంటూనే అసభ్యంగా ఆమెను చూడకుండా వుండలేకపోయాను.

ఆమెది పుణికిపుచ్చుకున్న అందం. బంగారు ఛాయ. గిల్లితే పాలుకారతాయేమో సన్నంత సున్నిత శరీర సౌరభం. కోలముఖం, లక్కపిడతలాంటి నోరు, అద్దాలకు సిగ్గుగొల్పే చెక్కిళ్లు, చక్రాల్లాంటికళ్లు, పోత పోసిన బంగారువిగ్రహమాయె. వహ్వా! బ్రహ్మదేవుని నైపుణ్యం అతీతం. ఆమెనుచూస్తే విజాతి మాట ఎట్లాగున్నా స్వజాతిమాత్రం ఈర్ష్య పడకమానదు. నల్లని దుబ్బులాంటి వంకీల జుట్టును వదులుగా బర్మా వేలిముడిచుట్టిందేమో! ఆమె తలకట్టుకు ప్రత్యేక ఆకర్షణ వచ్చింది. ఆమె పెట్టుకున్న వెడల్పాంటి బెంగాలుదుద్దులు ముద్దుగావున్నాయి. వీటన్నిటికితోడు ఆమె కట్టిన గులాబిరంగు జరీచీర ఆమెకొక వింత సోయగాన్నిచ్చింది. ముగ్గురు పిల్లల్నికన్నా ఆమెది నిండైన బిరుసైన యవ్వనం. కన్నెపిల్లలుగూడ సిగ్గుపడాల్సిన శరీరసౌష్టవం. పిల్లలు! రామ! రామ! పిల్లలు కాదు వాళ్ళు కోతిపిల్లలు. నాకళ్ళు జాలిగా చూసాయి. నా హృదయం ఖేదపడింది. ఎందుకు? ముగ్గురు పిల్లలలో కనీసం ఒక్క పిల్లయినా తల్లిపోలికనుగాని, శరీరఛాయనుగాని కలిగివుండనందుకు. ఆమెను చూసిన కళ్లతోనే ఆమె పిల్లల్నిచూస్తే ఏ మానవహృదయమైనా జాలిపడక మానదు.

ఏవేవో వూహలు వూహించుకుంటూ అనుకున్నాను. "ఆమె నావంక ఒక్కసారి చూస్తే బాగుండునని" అనుకున్నంతా అయ్యింది. ఓరగా కోరగా చూసింది ఆమె నావంక. నిశితంగా ఆమెను చూడలేక ప్రక్కకు తిరిగేను. తిరిగేనేకాని నా హృదయ ఆరాటం మితి మీరింది. నా గుండెల్లో వెయ్యి రైళ్ళు పరుగెత్తినట్టయింది. కడుపులో చెయ్యిపెట్టి దేవినట్టుగా, ఆటంబాంబుప్రేలినంత హడావిడిగా ఎంతో వ్యథపడ్డాను. ఆ వ్యథతో నీరసంగా ఆమెను మళ్లీ చూడాలనిపించింది చూశాను. అదేసమయంలో మళ్లీ చూసిందామె. ఎందుకో సిగ్గుతో తలదించుకున్నాను. అవును సిగ్గుగాక ఏమిటి చెప్పండి. ఇంతాచెప్పిన నేనుమాత్రం ఆమెభర్తకంటె ఏమంత అందగాడిని గనుక. ఈ ఆలోచనతట్టిన నాకుమరి ఆమెను చూడాలనిపించలేదు. ఒక్కొక్కప్పుడు మనంచెయ్యకూడదనుకున్నపనులు, పరిస్థితుల ప్రభావంవల్లగాని, అనుకోని వింత సంఘటనలవల్లగాని తప్పనిసరిగా వాటంతట అవే సహజంగా జరిగిపోతుంటాయి.

రొప్పుకుంటూ గాలిని చీల్చుకుంటూ పరుగెత్తుతున్నబండి బ్రహ్మాండం బ్రద్దలయ్యేట్టు ఒక్క అరుపు అరచి తునిస్టేషన్‌లో ఆగింది. నాపక్కనే కూర్చున్న అతను మాను ఎదురుగా కూర్చున్న ఆమెను అడిగాడు "కాఫీ కావాలా?" అని. "అబ్బే నా కక్కరలేదు పిల్లలకు యిప్పించండి" అంది. ముగ్గురు పిల్లలతోసహా దిగేడతగాడు. ఏమీ తోచక సతమతమవుతున్న నేనుకూడ దిగి కాసిని కాఫీ నీళ్లు సేవించివచ్చి మళ్లీ యథాస్థానంలో చతికిలబడ్డాను.

గార్డు విజిల్‌వూది పచ్చజండా వూపుతుండగా ఎక్కేడతడు పిల్లలతోసహా. కాని చిన్నపిల్ల లోపలకు రాకుండా గేటుదగ్గరేవుండిపోయింది. రైలు చక్‌చక్‌మంటూ బయలుదేరి వేగాన్ని హెచ్చిస్తూవుంది. ఆమెకుదగ్గరగావచ్చి కూర్చుంటున్న అతనితో అంది "చంటిదేదండీ!" అని "రాలేదూ?" అంటూ అమాయకంగా తిరిగి ప్రశ్నించాడతను. అంతే "అయ్యయ్యో చంటిదాన్ని ఏం చేసారండీ!" అంటూ ఏడుస్తూ కిటికీలోంచి బయటకు ప్లాట్‌ఫారంవైపు చూస్తూ "అదిగో మనచంటిది అక్కడే వుండిపోయింది. రైలు ఆపండి నాయనా రైలు ఆపండి" అని ఒకటే గోల చేసింది. అందరూ ఆపమంటే ఆపమన్న వారేకాని ఏ వక్కరూ ఆపరు. నా నోటిలో వున్న సిగరెట్టు పారేసి నాకుదగ్గరగా పైన వున్న గొలుసులాగాను. బండి ఆగిపోయింది. పెట్టెలోని జనమంతా కిటికీలగుండా బయటకు చూస్తున్నారు.

"నాన్నాలూ బండీ ఆగిందేమండీ" అంటూ తపతపానడుస్తూ గుమ్మంవద్దనున్న జనం లోంచివచ్చింది మూడేళ్లచంటిముండ. ఏడుస్తున్న ఆమె "అయ్యో ముండా నువ్వెక్కడున్నావే?" అంటూ ఎత్తుకొని హృదయాని కదుముకుంటూ "ఏమండోయ్ ఇదిగో మన పాప" అంది సంతోషాన్ని వెలిగక్కుతూ. అంతా అటుచూసి నవ్వుకున్నారు.

"ఏమిలేంది గొలుసులాగి మవ్వ మీరు తంటా తెచ్చిపెట్టుకున్నారు" అన్నాడు నా ప్రక్కగా కూర్చున్న ఒక పల్లెటూరి ఆసామీ. "అవునండీ! ఆమెచేసిన గోల చూసారుగా!" ఒక్కక్షణం యోచించి పెట్టెలోవున్న వారినందరినీ వుద్దేశించి గట్టిగా "అయ్యా దయచేసి గార్డువచ్చి అడిగితే మీరు ఎవరూ ఏం మాట్లాడవద్దు. తరువాత గొడవ నేను చూసుకుంటాను. ఏమైనాసరే గొలుసు పలానివారు లాగేరనిమాత్రం వాడికి తెలపగూడదు"అంటూ హెచ్చరించేను. నా వేషభాషలవల్ల నైతేనేం, నా మాటల చాతుర్యంవల్లనైతేనేం ఆ వక్కక్షణంలో మొత్తంమీద అందరూ వక్కకొలిక్కివచ్చి "సరేనంటే సరే!" నన్నారు.

బ్లూఫాంటు, తెల్లకోటు, నల్లటోపీ పెట్టుకున్న గార్డు నోటిలో విజిల్‌తోసహా మా పెట్టెయెక్కి గొలుసువెపుచూసాడు. అంతా నిశ్శబ్దంగా అతనివైపే చూస్తున్నారు. అతడు మావైపుతిరిగి "గొలుసు ఎవరులాగేరు? ఎందుకు లాగేరు?" అన్నాడు. ఎవరూ మాట్లాడలేదు. "ఏమండీ ఎవరూ మాట్లాడరేం?" మళ్లీ ప్రశ్నించాడు. ఒకరివంక వకరు చూసుకోడం తప్ప ఎవరూ మాట్లాడలేదు. "ఏం మనుషులండీ! ఏమీ ఎరగనట్టు మూగవాళ్లలా మాట్లాడరేం?" కోపంగా హుంకరించాడు. ఎవరూ మాట్లాడలేదు. అతడు నావైపుచూస్తూ సాదరంగా "ఏమండీ మీరు యువకులు చదువుకున్న వారులాగున్నారు. మీరైనా నిజం చెబుతారని ఆశిస్తున్నా" అన్నాడు పాపం! దీనికంతకూ కారకుడను నేనని అతనికేంతెలుసు, మాట్లాడకుండా పెదిమ విరిచేను.

ఊం మీరంతా ఒకటే! ఎలా చెప్పకుండా వుంటారో నేను చూస్తా "రుసరుసలాడుతూ దిగిపోతుండగా పెట్టెలోని వాళ్లంతా ఒక్కసారిగా నవ్వేరు. దిగుతున్నవాడల్లా మళ్లీ యెక్కి" ఎందుకా నవ్వు ? గొప్పపని చేసామనా?" ఉడికిపోయి కస్సుమన్నాడు. అంత సేపు క్రింద గుమిగూడి చూస్తున్న జనంలో నుంచి ఎవరో ఒక కొంటెవాడు "పెట్టెలో వాళ్ళంతా మీమీద సమ్మెచేసారు సార్!" అన్నాడు. సమ్మెటసమ్మె 'డేమ్‌ఇన్‌సల్ట్' రైలు పెట్టెల్లోకూడ సమ్మెచేస్తేనేగాని దేశం పురోగమించినట్టుకాదేమో!" అంటూ వెళ్లిపోయాడు.

అతడు వెళ్లిన ఐదు నిమిషాలకు బండి కదిలింది. ఆ కదలికశబ్దంలో కలిసేటట్టుగా ఆమె కిలకిలా నవ్వుతూ "బలేవారండి మీరు అనుకున్నపని చెయ్యనూగలరు, ఒకరిచేత చేయించనూ గలరు" అంది. "ఇదంతా మీ మూలంగానే జరిగిందిగా!" అంటూ ఆమెతోపాటు నేనూ నవ్వేను. *


# కామధేను

ఇది విలువైన మలయాళ మూలికలతో ప్రాచీనాయుర్వేదపద్ధతిని శాస్త్రీయంగా తయారైన గొప్పమందు. వ్యాధిగ్రస్తులే కాక ఎట్టి వ్యాధిలేనివారుకూడా దీనినిసేవిస్తే దేహాన్ని బలపరచి రసాయనంగా పనిచేయును.

**దీనిని స్త్రీ పురుషులు నిరభ్యంతరముగా వాడవచ్చును. మందు మంచి రుచిగావుండును. పథ్యములేదు.**

వీర్యనష్టం, ఋతుదోషం, నరముల నిస్సత్తువ, సెగరోగం, మూత్రదోషం మొదలయిన వ్యాధులకు ఈ మందు పెట్టింది పేరు. మూత్రముతోపావు శుక్లమును, మేహదుర్నీరును, మేహవ్యాధిని, మేహదురదను, మూగతీటను, జననేంద్రియ సంబంధమైన రుగ్మతలను, జననేంద్రియం సన్నబడుట, చిక్కిపోవుట, లేపనశక్తి తగ్గివుండుట, మధుమేహం, నిద్రలేమి, ధాతు దృఢీకరణం లేకుండుట, నరముల నిస్సత్తువ మున్నగు వ్యాధులను ఇది తప్పక కుదుర్చును. మేహకాక, మూలకాక, గుండెదడ, వెన్నునొప్పి, దగ్గు, కాసము మున్నగు బాధలను నివారణచేయును.

ఆకలిలేమి, మలబద్ధకం, నీరుకుట్టు, నడుమునొప్పి, కాళ్లుచేతులు తీట, తెలుపువ్యాధి, తలతిప్పుట, జ్ఞాపకశక్తి తగ్గుట మొదలైన బాధలను నివారించి బలాన్ని, ఆరోగ్యాన్ని, దేహకాంతిని యిచ్చి యెంతో మేలుచేయును. శీఘ్రంగా ముసలితనం రాకుండా చేస్తుంది.

డబ్బి 1-8 రు. 3=0

ధనలక్ష్మి అండ్ కో., ★ సౌకార్‌పేట, మద్రాసు-1.